సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



పెండింగ్ అర్జీలపై దృష్టి
జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మొత్తం 269 అర్జీలు స్వీకరించామని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. 8లో



యుద్ధ ప్రాతిపదికన పనులు
కేకే లైన్‌లో రైల్వే ట్రాక్‌పై కొండచరియలు విరిగిపడడంతో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. 8లో



ముగిసిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు
చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు సోమవారంతో ముగిశాయి. 8లో

న్యూస్‌రీల్

విశాఖ అంతర్జాతీయ స్టేడియం నిర్మాణానికి సహకారం

బీసీసీఐ కార్యదర్శి జై షా



బీసీసీఐ కార్యదర్శి జై షాతో ఏసీఏ అధ్యక్ష కార్యదర్శులు శరత్‌చంద్ర, గోపినాథ్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ నగరంలో అంతర్జాతీయ స్టేడియం నిర్మాణానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని బీసీసీఐ కార్యదర్శి జై షా హామీ నిచ్చారు. సోమవారం గోవాలో 92వ బీసీసీఐ వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు పి.శరత్‌చంద్రరెడ్డి, కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి, కోశాధికారి ఎ.వి.చలం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్ర క్రికెట్‌కు సంబంధించి పలు అంశాలపై బీసీసీఐ అధ్యక్షుడు రోజర్‌బిన్నీ, కార్యదర్శి జై షా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తదితరులతో వీరు చర్చించారు. త్వరలోనే విశాఖ వస్తానని బీసీసీఐ కార్యదర్శి జై షా హామీ ఇచ్చారని శరత్ చంద్రరెడ్డి తెలిపారు.

సింహగిరిపై రెండో రోజు పవిత్రోత్సవాలు



వేద పఠనాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామివారిని వేద పఠనాలతో అర్చకులు కొలిచారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. నాలుగు వేదాలతో స్వామిని కొలిచారు. అలాగే కల్యాణ మండపంలోనే ఏర్పాటుచేసిన హోమగుండం వద్ద విశేష హోమాలు, రాత్రి అదివాస పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ పూజలు జరిపారు. మూడో రోజు మంగళవారం రాత్రి పవిత్ర సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

నేడు కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ఫగ్గాన్ పర్యటన

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి ఫగ్గాన్ సింగ్ కులస్తే మంగళవారం స్టీల్‌ప్లాంట్ సందర్శించనున్నారు. సాయంత్రం ఆయన హిల్‌టాప్ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి ఉక్కు అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌కు వెళతారు. అక్కడ ఉక్కు యాజమాన్యం అందించే కార్పొరేట్ ప్రజంటేషన్ తిలకించనున్నారు. అనంతరం ఉక్కు అధికారుల సంఘం, కార్మిక సంఘాలు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలతో సమావేశం కానున్నారు. రాత్రి హిల్‌టాప్ గెస్ట్ హౌస్‌లో బస చేయనున్నారు. బుధవారం ఉదయం ఢిల్లీకి బయలుదేరనున్నారు.

నేడు సాగరమాలలో రోజ్‌గార్ మేళా

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం సాలగ్రామపురంలో గల సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం రోజ్‌గార్ మేళా నిర్వహించనున్నారు. విశాఖపట్నం డివిజన్, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళాకు ముఖ్య అతిథిగా కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి నారాయణస్వామి హాజరుకానున్నారు. ఈ మేళాలో నూతనంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేస్తారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రారంభించనున్నారు.

విశాఖ నుంచి కాశీకి డైరెక్ట్ రైలు

తాటిచెట్లపాలెం : ఉత్తరాంధ్ర, దక్షిణ, పశ్చిమ ఒడిశా జిల్లాలు, చత్తీస్‌ఘడ్‌లోని మారుమూల జిల్లాల వాసులకు ప్రయోజనం చేకూరేలా సంబల్‌పూర్ వారణాసి-సంబల్‌పూర్ రైలును విశాఖపట్నం వరకు పొడిగిస్తూ రైల్వే మంత్రి, రైల్వే బోర్డు అంగీకారం తెలిపింది. గతంలో ఈ ప్రాంతాల్లో పర్యటించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఈ ప్రాంత ప్రజలు పలు విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం వారణాసి-సంబల్‌పూర్-వారణాసి (18312/11) మధ్య వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తుంది. ఈ రైలును త్వరలో టిట్లాఘడ్, రాయగడ మీదుగా విశాఖ వరకు పొడిగిస్తున్నారు.

ఇదీ గంటా 'స్కిల్'!

తప్పుడు సర్వేలతో ముదపాక భూముల వ్యవహారంలో బండారు.. మోసపూరిత విధానంతో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తమ 'స్కిల్' కనబరిచారు. ఐటీ రిటర్న్సు కూడా దాఖలు చేయని తన సతీమణి పేరుతో ఏకంగా రూ.92 లక్షలకుపైగా నగదుతో గంటా భీమిలిలో కొనుగోలు చేసిన భూ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది.
నిబంధనలకు విరుద్ధంగా భారీ నగదుతో జరిపిన లావాదేవీల్లో పేర్కొన్న పాన్ నంబర్ కూడా తేడాగా ఉండటం గమనార్హం.

- భీమిలిలో భారీ నగదుతో 1,938 చ.గ స్థలం కొనుగోలు
- భార్య పేరుతో భూ వ్యవహారం చేసినట్టు ఒప్పందం
- ఆమె పేరుతో ఐటీ రిటర్న్సును దాఖలు చేయని వైనం
- అఫిడవిట్‌లో ఒకటి.. అగ్రిమెంటులో మరో పాన్‌కార్డు నెంబరు
- ఐటీ శాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం


సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా! అన్న చందంగా.. తెలుగుదేశం పార్టీ నేతలు తమ నాయకుడి తరహాలోనే కనికట్టు చేయడంలో ఆరితేరిపోయారు. ఒకవైపు స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో బోగస్ కంపెనీలతో కోట్లు కొట్టేసి జైలులో చంద్రబాబు ఉన్నారు. తాను తక్కువేమీ కాదన్నట్టు... భీమిలిలో తన సతీమణి పేరు మీద కొనుగోలు చేసిన భూ వ్యవహారంలో గంటా కూడా అదే తరహా 'స్కిల్' కనబరిచారు. ఆదాయపన్నుశాఖ నిబంధనలకు విరుద్ధంగా కేవలం నగదు రూపంలో రూ.92 లక్షలకుపైగా చెల్లింపులు ఆయన సతీమణి పేరు మీద చేసినట్టు లెక్కల్లో చూపారు. అయితే, ఆమె తరఫున ఐటీ రిటర్న్సును ఎక్కడా దాఖలు చేయకపోవడం గమనార్హం. గంటా శ్రీనివాసరావు భీమిలి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే... భీమిలి ప్రాంతంలో 1,936 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన కొనుగోలు ఒప్పందంలో గంటా వ్యవహరించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.



అంతా నగదు రూపంలోనే...!

ఆదాయపన్నుశాఖ చట్ట ప్రకారం రూ.2 లక్షలకు మించి నగదు లావాదేవీలు చేపట్టరాదు. ఈ నిబంధనలేవీ తెలియని వ్యక్తి కాదు గంటా శ్రీనివాసరావు. అయితే తన సతీమణి పేరుతో 2018లో భూముల కొనుగోలులో నగదు రూపంలోనే మెజార్టీ వ్యవహారం నడవడం విమర్శలపాలవుతోంది. అంతేకాకుండా ఆయన మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఈ విధంగా జరగడం బహుశా యాదృచ్ఛికం కాకపోవచ్చు. రూ.92.98 లక్షలు కేవలం నగదు రూపంలో ఇచ్చినట్టు చూపారు. మరో రూ. 25 లక్షలను ఆర్‌టీజీఎస్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసినట్టు చూపి.. సర్వే నెంబరు.. టీఎస్ నెంబరు 1490, బ్లాక్ నెంబరు 17, వార్డు నెంబరు 24లోని 1936 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఒకవేళ ఇంత భారీ స్థాయిలో నగదు లావాదేవీలు జరిపితే పాన్‌నెంబరు పేర్కొనడంతో పాటు ఐటీ రిటర్న్సును దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒకవైపు తన అఫిడవిట్‌లో గంటా శారద 2014–15 నుంచి 2018–19 మధ్య ఒక్కసారి కూడా ఐటీ రిటర్న్సు దాఖలు చేసినట్లు చూపించలేదు. మరోవైపు గంటా శ్రీనివాసరావు మాత్రం 2014–15 నుంచి ఐటీ రిటర్న్సును దాఖలు చేసినప్పటికీ 2018–19 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.30,39,338 ఆదాయంగా చూపడం గమనార్హం. ఆదాయపన్నుశాఖ సెక్షన్ 271 డి ప్రకారం... రూ. 2 లక్షలకు మించి నగదు లావాదేవీలను నిర్వహిస్తే శిక్షార్హుడు అవుతారు. ఆదాయపన్నుశాఖ సెక్షన్ 269 ఎస్‌టీ ప్రకారం అంతే మొత్తాన్ని పెనాల్టీ రూపంలో వసూలు చేసే అధికారం ఉంది.




Name	PAN	The financial year for which the last Income tax return has been filed	Total Income shown in Income Tax Return (in Rupees) for the last five financial years completed (as on 31st March)
Self Ganta Srinivasa Rao	[illegible]	2018-19 2017-18 2016-17 2015-16 2014-15	(i) Rs.30,39,338/- (ii) [illegible] (iii) [illegible] (iv) [illegible] (v) [illegible]
Spouse G sarada	ABPPG2215A	Returns not yet filed	(i) Returns not yet filed (ii) Returns not yet filed (iii) Returns not yet filed

ATTESTED NOTARY

గంటా ఎన్నికల అఫిడవిట్‌లో తన సతీమణి గంటా శారద 2014 నుంచి 2019 వరకూ ఐటీ రిటర్న్స్ దాఖలు చేయనట్లుగా చూపించిన వైనం






Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 8,00,000/- Paid by way of cash
Rs. 6,00,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 12,00,000/- Paid by way of cash
Rs. 10,00,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 8,00,000/- Paid by way of cash
Rs. 10,00,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 4,00,000/- Paid by way of cash
Rs. 6,98,000/- Paid by way of cash
Rs. 5,00,000/- Paid by way of cash
Rs. 25,00,000/- Paid by way of RTGS on

పరిమితికి మించి నగదు చెల్లింపులు చేసినట్లుగా కొనుగోలు ఒప్పంద కాపీ

రెండు పాన్‌కార్డులు ఉండొచ్చా..!



SALE DEED IN FAVOUR OF
Smt. GANTA SARADA, (Pan No. ABPPG 2216A) aged 50 years, W/o. Sri. Ganta Srinivasa Rao, residing at Plot no. 231, Door No. 1-84-10/1, Sector-4, MVP Colony, Visakhapatnam, herein after called the "VENDEE" which term shall mean and include her heirs, executors, administrators and assignees on the other

భూ కొనుగోలు డాక్యుమెంట్‌లో గంటా సతీమణి పేరుతో ఉన్న పాన్‌కార్డు నంబర్



Spouse			
G sarada	ABPPG2215A	Returns not yet filed	(i) (ii) (iii)

ఎన్నికల అఫిడవిట్‌లో గంటా సతీమణి పాన్‌కార్డ్ నంబర్

భీమిలిలో భూములు కొనుగోలు చేసిన సందర్భంలో ఆయన సతీమణి పేరు మీద పేర్కొన్న పాన్ కార్డు నెంబరు ఏబీపీపీజీ2216ఏ. అయితే, ఆయన అఫిడవిట్‌లో మాత్రం తన సతీమణి పాన్ నెంబరు ఏబీపీపీజీ2215ఏగా పేర్కొన్నారు. వాస్తవానికి ఐటీశాఖ నిబంధనల ప్రకారం రెండు పాన్ కార్డు నెంబర్లను కలిగి ఉండటం చట్టరీత్యా నేరం.

రెండు పాన్‌కార్డులు ఉంటే అప్పగించాల్సిందే..

- అప్పటికే ఉన్న పాన్‌కార్డులో ఏవైనా తప్పులు ఉంటే... వాటిని సరిచేసుకోకుండా కొత్త దానికి దరఖాస్తు చేయడం.
- పాన్‌కార్డు కోసం పలు మార్లు దరఖాస్తు చేయడం
- పెళ్లికి ముందు ఒక పాన్‌కార్డు... పెళ్లి తర్వాత మరో పాన్‌కార్డుకు మహిళలు దరఖాస్తు చేసిన సమయంలో...
- ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టే ఉద్దేశంతో అక్రమంగా రెండు పాన్‌కార్డులను కలిగి ఉండటం.

ఇందులో ఏదైనా చట్టరీత్యా నేరమే. తమకు ఉన్న రెండు పాన్‌కార్డులను వెంటనే తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఆదాయపన్నుశాఖ చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే, ఈ వ్యవహారంలో నిజంగా రెండు పాన్ కార్డులు ఉన్నాయా? ఒకే సిరీస్‌లో కేవలం నెంబరు మార్చి తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో ఈ వ్యవహారం నడిచిందా? అనేది లోతుగా విచారిస్తే గాని తెలిసే అవకాశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏదీ ఏమైనా తెలుగుదేశం నేతలు అవినీతి వ్యవహారంలో చూపుతున్న 'స్కిల్' మాత్రం కొంగొత్త పుంతలు తొక్కుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కమలా గణపతి అలంకరణలో సంపత్ వినాయకుడు



సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయకుడు సోమవారం కమలా గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4 గంటలకు హోమం, అభిషేకాలు, 6 గంటలకు ఆలంకరణ మంగళహారతి నిర్వహించారు.

కొత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని సోమవారం 30 కిలోల తెల్ల ద్రాక్ష, 50 కిలోల రేగుపండ్లతో అలంకరించారు. ఈ ప్రత్యేక అలంకరణతో మంగళవారం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు అలంకరించారు.

మందుబాబులకు జైలు శిక్ష.. జరిమానా

దొండపర్తి: నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పోలీసులు విస్తృతం చేశారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆదేశాల మేరకు ప్రతి స్టేషన్ పరిధిలో డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహ నాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఇద్దరికి జైలు శిక్షతో పాటు అనేక మందికి జరిమానాలు విధిస్తూ కోర్టులు తీర్పునిచ్చాయి. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 10 మందిని 6వ స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా.. అందులో 21 ఏళ్ల ఆటోడ్రైవర్ జాగారపు పరదేశికి 15 రోజులు జైలు శిక్ష, సదరు ఆటో యజమానికి రూ.7 వేలు జరిమానా విధించారు. అలాగే ఎం.సంతోష్‌కుమార్ అనే ద్విచక్రవాహదారుడికి 10 రోజులు జైలు శిక్ష వేశారు. దీంతో ఇద్దరినీ సెంట్రల్ జైలుకు పంపించారు. అదే విధంగా మరో 8 మందికి మొత్తంగా రూ.49 వేలు ఫైన్‌గా విధించారు. మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 30 మందిని రెండో స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా మొత్తంగా రూ.1.23 లక్షలు ఫైన్ వేశారు. పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో 19 మందిని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున జరిమానా వేశారు. గోపాలపట్నం పరిధిలో 22 మందికి రూ.1.15 లక్షలు, పెందుర్తి పరిధిలో 19 మందికి రూ.95 వేలు, హార్బర్ పరిధిలో 19 మందికి రూ.39 వేలు, గాజువాకలో 9 మందికి రూ.45 వేలు, స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 9 మందికి రూ.49 వేలు జరిమానా విధించారు.

తప్పుడు ఆరోపణలు తగవు

- కార్పొరేటర్ మూర్తియాదవ్‌పై చర్యలకు డిమాండ్
- మేయర్‌కు రిసోర్స్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ యూసీడీ పీడీపై కార్పొరేటర్ పీతలమూర్తి యాదవ్ ఆరోపణలు మానుకోవాలని జీవీఎంసీ యూసీడీ హెచ్‌ఆర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎంపీ రత్నం విజ్ఞప్తి చేశారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మేయర్ హరివెంకట కుమారికి వినతిపత్రం అందజేశారు. యూసీడీ పీడీ అండర్‌లో పనిచేస్తున్న సీవోలు, ఏపీడీని, ఆర్పీలను, మహిళలను ఎన్నడూ కించపరచలేదన్నారు. విధి నిర్వహణలో నిబంధనలు ప్రకారం నడుచుకుంటున్నానన్నారు. ఇది కొంత మందికి నచ్చక ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్పొరేటర్ మూర్తియాదవ్ చేసిన ఆరోపణలు తమలో కలతలు రేపడానికేనని అర్థమవుతోందన్నారు. ఇది వ్యవస్థకు మంచిది కాదని పేర్కొన్నారు.

ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరగలేదు

రిసోర్స్ పర్సన్లకు, యూసీడీ పీడీ పాపునాయుడు మధ్య ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరగలేదని, ఈ విషయంపై విచారణ జరిపించి మూర్తియాదవ్‌పై చర్యలు తీసుకోవాలని రిసోర్స్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర మేయర్ హరి వెంకటకుమారికి ఫిర్యాదు చేసింది. అసోసియేషన్ అధ్యక్షురాలు ఎస్.అలివేణి ఆర్పీల తరఫున మేయర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆర్పీలు, యూసీడీపీడీ మధ్య చిచ్చు పెట్టడంపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అందుబాటులోకి మెరైన్ మ్యూజియం

- ప్రారంభించిన కేంద్ర మత్స్యశాఖ మంత్రి రూపాల
- అనంతరం వాణిజ్య, ఆక్వా ప్రతినిధులతో సమావేశం



మ్యూజియంలో మత్స్య జాతులను తిలకిస్తున్న కేంద్ర మంత్రి రూపాలా

సాక్షి, విశాఖపట్నం: విశాఖ బీచ్‌రోడ్డులో ఉన్న ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఐ) భవనంలో ఆధునీకరించిన మెరైన్ మ్యూజియాన్ని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా సోమవారం ప్రారంభించారు. ఈ మ్యూజియంలో అరుదైన 250 రకాల మత్స్య జాతులను ప్రదర్శనకు ఉంచారు. వీటిని మంత్రి పరిశీలించారు. ఆయా జాతుల ప్రత్యేకతలను, ఏఏ ప్రాంతాలు, దేశాల సముద్ర జలాల్లో ఇవి లభ్యమవుతాయో ఎఫ్‌ఎస్‌ఐ అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి మత్స్య పరిశ్రమ, సీఐఐ, చాంబరాఫ్ కామర్స్, ఆక్వా ఎగుమతుల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి వివిధ అంశాలు, సమస్యలను తీసుకెళ్లారు. ఈక్వెడార్.. వివిధ దేశాలకు తక్కువ ధరకే మత్స్య ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని, దీని ప్రభావం మన మత్స్య ఎగుమతులపై తీవ్రంగా పడుతోందని సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్ చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంటుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ జనాభా చైనాకంటే అధికంగా ఉన్నప్పటికీ చేపల వినియోగం ఆ దేశంకంటే తక్కువగా ఉందని, వీటి వినియోగం పెరిగేలా చర్యలు చేపట్టాలని మరో ప్రతినిధి సూచించారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డును హైదరాబాద్ నుంచి విజయవాడకు గాని, విశాఖకు గాని మార్చాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి శ్రీనాథ్ విజ్ఞప్తి చేశారు. ఎగుమతుల్లో ప్రోత్సాహకాలు పెంచాలని, ఆక్వా మేత ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సీఐఐ ప్రతినిధి కోరారు. ఈ ప్రతినిధుల సూచనలు, అభ్యర్థనలను పరిశీలిస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, ఎఫ్‌ఎస్‌ఐ డీజీ జయ భాస్కరన్, విశాఖ ఎఫ్‌ఎస్‌ఐ మెకానికల్ మెరైన్ ఇంజనీర్ భామిరెడ్డి, శాస్త్రవేత్త ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ, ఆక్వా రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌ఐ దేహదారుఢ్య పరీక్షలు

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్‌ఐ ఉద్యోగాల నియామకం కోసం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. విశాలాక్షినగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో ఆగస్టు 25 నుంచి సుమారు నెల రోజులపాటు జరిగాయి. పోలీస్ అధికారులు హాజరైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి ఎత్తు, బరువు కొలతలు, అనంతరం వరుసగా 1600 మీటర్లు, 100 మీటర్లు పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. ఆయా పరీక్షలకు పురుషులు, మహిళా అభ్యర్థులు సుమారు 75 శాతం మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. అక్టోబరు 14, 15 తేదీలలో ప్రధాన రాత పరీక్ష నిర్వహించనున్నట్లు విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు.



పరుగు పోటీలో ఎస్‌ఐ అభ్యర్థులు

ఉత్సాహంగా ఖోఖో జట్ల ఎంపిక



బెలూన్లు ఎగురవేస్తున్న అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ, అధికారులు



హోరాహోరీగా ఖోఖో పోటీలు

15 నియోజకవర్గాల నుంచి 900 మంది క్రీడాకారుల హాజరు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి రాష్ట్ర ఖోఖో పోటీల్లో పాల్గొననున్న జట్లను ఎంపిక చేశారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం, 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖోఖో అండర్ 14, 17 (బాలురు, బాలికల) విభాగాల్లో పోటీలు నిర్వహించి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. 15 నియోజకవర్గాల నుంచి 900 మంది క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. ప్రతిభ ఆధారంగా రాష్ట్ర ఖోఖో పోటీల్లో పాల్గొననున్న వారిని ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలకు సరైన ప్రాధాన్యమివ్వాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితో ఆటల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోలాటం, లెజిమ్స్, పిరమిడ్స్, డంబుల్స్‌తోపాటు వివిధ నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ముందుగా డీఈవో, ఇతర అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. శాంతి కపోతాలు, బెలూన్లు ఎగువేశారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. తర్వాత క్రీడా కోర్టు ప్రారంభించారు. సాయంత్రం పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీ రవిబాబు, వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి దివాకర్, లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, మాజీ సర్పంచ్ కర్రి రామజోగి నాయుడు, సుందరపు అప్పారావు, ఎస్‌జీఎఫ్ అనకాపల్లి, విశాఖ జిల్లా కార్యదర్శులు ఎం.వి.నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎం.నాయుడు, కిరణ్, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎ.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.37.5 కోట్లతో మైదానాలు

ఏయూ బోర్డ్ సమావేశంలో వీసీ ప్రసాదరెడ్డి వెల్లడి

విశాఖ స్పోర్ట్స్ : ఖేలో ఇండియాలో భాగంగా శాప్ సహకారంతో రూ.37.50 కోట్లతో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయనున్నట్టు ఏయూ వీసీ, స్పోర్ట్స్ బోర్డ్ చైర్మన్ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన ఏయూ వార్షిక స్పోర్ట్స్ బోర్డ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడామైదానాల్లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. వీటిలో భాగంగానే స్విమ్మింగ్ పూల్ కాంప్లెక్స్, సింథటిక్ ఫుట్‌బాల్ ప్లే ఫీల్డ్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నా మన్నారు. ఏయూలో ప్లే ఫీల్డ్స్‌తో పాటు ఆరు క్రీడామైదానాలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వ్యాయామ విద్య విభాగపు పూర్వ వాలీబాల్ కోచ్ స్వర్గీయ కోదండరామయ్య పేరిట కుటుంబ సభ్యులు సెమినార్ హాల్‌ను రూ.2 కోట్లతో నిర్మించనున్నామని, ఇప్పటికే పనులు జరుగుతున్నాయన్నారు. ఏపీలో క్రీడలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఉపాధి అవకాశాలతో పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వర్సిటీలో పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగాలు అందించిన ఘనత ఏయూకే దక్కిందన్నారు. విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఇంక్యుబేషన్ సెంటర్ల ఏర్పాటు చేశామన్నారు. ఆచార్యులు, సహాచార్యులు పోస్టుల భర్తీ చేస్తామన్నారు. ఏయూ వ్యాయమవిద్య సంచాలకుడు విజయ్‌మోహన్ మాట్లాడుతూ పలు క్రీడాంశాల్లో అంతర కళాశాలలు, సౌత్‌జోన్, ఆల్ ఇండియా అంతరవర్సిటీ పోటీలకు రూ.2.2 కోట్ల అంచనా బడ్జెట్ రూపొందించామన్నారు. కార్యక్రమంలో బోర్డ్ కోశాధికారి, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, విభాగపు హెడ్ ఎ.పల్లవి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. మీరట్‌లో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా వర్సిటీ వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణం సాధించిన ఎస్.పల్లవిని వీసీ ప్రసాదరెడ్డి సత్కరించారు.



వెయిట్‌లిఫ్టర్ పల్లవిని సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు

నేడు కూడా పలు రైళ్ల గమ్యం కుదింపు



కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో పనులను పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ కేకే లైన్‌లో మనబార్-జరటి స్టేషన్ల పరిధిలో ఆదివారం తెల్లవారుజామున రైల్వే ట్రాక్‌పై కొండచరియలు విరిగిపడిన సంగతి తెలిసిందే. దీంతో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, సంబంధిత అధికారులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పునరుద్ధరణ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. అత్యధిక సామర్థ్యం గల మెషినరీ, మెటీరియల్స్‌తో ట్రాక్‌పై పడిన బండరాళ్లు, కొండచరియలను తొలగిస్తున్నారు. ఈ కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను మంగళవారం కూడా గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

గమ్యం కుదించిన రైళ్లు

సోమవారం రూర్కెలాలో బయల్దేరిన రూర్కెలా-జగదల్‌పూర్(18107)ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు నడిచింది. తిరుగు ప్రయాణంలో మంగళవారం జగదల్‌పూర్ - రూర్కెలా(18108) ఎక్స్‌ప్రెస్‌గా కోరాపుట్ నుంచి బయల్దేరి రూర్కెలా చేరుకుంటుంది. సోమవారం భువనేశ్వర్‌లో బయల్దేరిన భువనేశ్వర్-జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడిచింది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్- భువనేశ్వర్(18448) ఎక్స్‌ప్రెస్‌గా కోరాపుట్ నుంచి మంగళవారం బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది. విశాఖలో సోమవారం రాత్రి బయల్దేరిన విశాఖ-కిరండూల్ (18514) ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్ - విశాఖ (18513)ఎక్స్‌ప్రెస్‌గా కోరాపుట్ నుంచి మంగళవారం బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. విశాఖలో మంగళవారం బయల్దేరే విశాఖ-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్ - విశాఖ(08552)పాసింజర్ స్పెషల్‌గా మంగళవారం అరకు నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. హౌరాలో సోమవారం బయల్దేరిన హౌరా-జగదల్‌పూర్(18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్ - హౌరా (18006) ఎక్స్‌ప్రెస్‌గా టిట్లాఘడ్ నుంచి మంగళవారం బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

ఆలస్యంగా కిరండూల్ పాసింజర్

విశాఖపట్నంలో సోమవారం ఉదయం 6.45గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం-కిరండూల్ (08551)పాసింజర్ స్పెషల్ సుమారు 3 గంటలు ఆలస్యంగా ఉదయం 10 గంటలకు బయల్దేరింది.

పెండింగ్ అర్జీలపై దృష్టి

'జగనన్నకు చెబుదాం'లో అర్జీలు స్వీకరించిన కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న, కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 269 అర్జీలు స్వీకరించామని కలెక్టర్ మల్లికార్జున చెప్పారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అర్జీలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఏపీ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలన్నింటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు.. 96 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ మేయర్‌కు 13 ఫిర్యాదులు వచ్చాయని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఫోన్‌కాల్స్ స్వీకరించారు. వీటిలో ప్రధాన ఇంజినీరింగ్ విభాగానికి 6, పట్టణ ప్రణాళికా విభాగానికి ఒకటి, ప్రజారోగ్యానికి రెండు, యూసీడీకి రెండు, ఏడీసీకి ఒకటి, డీడీహెచ్‌కు ఒక ఫిర్యాదు వచ్చింది. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 96 ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం మేయర్ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను మూడు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళికా అధికారి వి.సునీత, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీపీ నరేంద్రరెడ్డి, కార్యదర్శి పి.నల్లనయ్య, డీసీ (రెవెన్యూ) ఫణిరామ్, డీడీ (హార్టీకల్చర్) దామోదరరావు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి బర్మా కాందిశీకుల సమస్యలు



నారాయణరావు

బర్మా కాందిశీకులు 13 ఏళ్లుగా అనేక సమస్యలతో సతమతమౌతున్నారని, వీటిని పరిష్కరించాలని బర్మా కాందిశీకుల పునరావాస సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.నారాయణరావు కోరారు. సోమవారం స్పందనలో ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కప్పరాడ గ్రామం సర్వే నంబరు 13లో 2010లో పక్కా గృహాలు నిర్మించి ఇచ్చారని నారాయణరావు వివరించారు. ఇంకా మిగిలిన భూమిని కొంతమంది కబ్జా చేస్తున్నారని, కబ్జా దారుల నుంచి స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి

హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో స్థానికులు ఉపాధి అవకాశాలు కల్పించాలని విశాఖ ఇండస్ట్రియల్ ఎరియా కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దేవర అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. స్థానికేతరులకు ఉపాధి కల్పిస్తూ స్థానికుల అన్యాయం చేస్తున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పోలీస్ స్పందనకు 64 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 64 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధి త అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణ తో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన చిప్పాడ గ్రామస్తులు

చిప్పాడ గ్రామంలో సర్వే నంబరు 28,29 ల్లో 7 ఏకరాల 59 సెంట్లు ప్రభుత్వ భూమిని కొందరు తప్పుడు పత్రాలతో కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. సోమవారం స్పందనలో చిప్పాడ సర్పంచ్ వేపాడ రమాదేవి సూరిబాబు, స్థానకులు కొల్లి కోటిరెడ్డి, మాజీ వీఆర్‌వో కొయ్యల అప్పల సూర్యనారాయణ రెడ్డి కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ భూమిని స్వాధీనం చేసుకొని ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. ఈ భూమిలో రెండు ఎకరాల భూమి దివీస్‌కు అప్పగిస్తే సీఎస్ఆర్ కింద ఆస్పత్రి నిర్మిస్తామని హామీ ఇచ్చారని కోటిరెడ్డి వివరించారు.

చిట్టీల పేరుతో ఘరానా మోసం

రూ 1.5 కోట్ల టోకరా



ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేసన్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

గోపాలపట్నం: నగరంలో చిట్టీల మోసం వెలుగు చూసింది. పైసాపైసా కూడబెట్టి.. చిట్టీలు కట్టి మోసపోయారు బాధితులు. కొందరు మహిళలు చిట్టీల పేరుతో రూ.1.50 కోట్లు వసూలు చేసినట్టు బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. వరలక్ష్మి చిట్టీల పేరుతో కొందరు మహిళలు కుచ్చుటోపి పెట్టడంతో బాధితులు ఎయిర్‌పోర్టు పోలీసులకు ఆశ్రయించారు. వివరాలిలావున్నాయి. కరాసా ప్రాంతంలో నివాస ముంటున్న బోర రాణి కిరణ్మయి, బోర శ్రీదేవిలు..వరలక్ష్మి, పప్పుల చిట్టీలు, పాట చిట్టీ, ఆర్‌డీ, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, దోనిక రెడ్డి లక్కీ స్కీమ్ పేరుతో పలువుర్ని మోసం చేశారు. మాధవదారకు చెందిన కొంత మంది మహిళలకు రూ.20 లక్షలకు పైగా ఎగవేశారు. గత ఏడాది రూ.12 లక్షలు ఇవ్వాల్సి ఉండగా ఆ నగదును ఆర్‌డీలో పెడితే ఎక్కువ వడ్డీ వస్తోందని నమ్మబలికారు. ఇలా చాలా మంది వద్ద చిట్టీల పేరుతో వసూలు చేసి దోచుకున్నారని బాధితులు వాపోయారు. నగరంలో పలువురి నుంచి సుమారు రూ.1.50 కోట్లు దోచుకున్నారని బాధితులు చెబుతున్నారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన వద్ద తాము కట్టిన రశీదులను చూపిస్తున్న మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో ఎయిర్‌పోర్టు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అనుమానంతో స్నేహితుడి హత్య



మృతుడు కిషోర్



నిందితుడు శివారెడ్డి

సీతమ్మధార : ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణమైన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా..ఆదివారం అర్ధరాత్రి రామా టాకీస్ సమీపంలోని శ్రీనగర్ ప్రాంతంలో మేడపై నుంచి కిషోర్ కుమార్ (25)ను శివారెడ్డి అనే యువకుడు తోసేశాడు. తీవ్రగాయాలైన కిషోర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నగరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో కిషోర్ సేల్స్ బోయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం శంకరమఠం సమీపంలో స్నేహితుడు నిర్వహించిన వినాయకుని నిమజ్జనంలో పాల్గొన్నాడు. అనంతరం రామాటాకీస్ శ్రీనగర్‌లో నివాసముంటున్న శివారెడ్డి ఇంటి మేడపై దయ,కిరణ్‌లతో కలిసి మద్యం సేవించాడు. రాత్రి 8 గంటలకు కిషోర్ ఇంటికి వెళ్లిపోయాడు. కొద్ది సేపటికే మళ్లీ శివారెడ్డి ఫోన్ చేసి మాట్లాడే పనుంది రమ్మని పిలిచాడు. కిషోర్ వచ్చిన తరువాత మళ్లీ వీరంతా కలిసి మద్యం సేవించారు. నా భార్యతో విడిపోవడానికి కారణం నువ్వేనని, వేరే వ్యక్తితో మాట్లాడడానికి నువ్వే ప్రోత్సహిస్తున్నావంటూ కిషోర్‌తో గొడవపడ్డాడు. వీరిద్దరిమధ్య మాటామాటా పెరగడంతో ఒక్కసారిగా కిషోర్‌ను మేడమీద నుంచి తోసేశాడు. వెంటనే అక్కడ నుంచి పరారయ్యాడు. గాయపడిన కిషోర్‌ను స్థానికులు, తోటివారు వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 6 గంటలకు కిషోర్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ద్వారకా ఏసీపీ వివేకానంద, సీఐ సింహాద్రి నాయుడు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనుమానంతోనే తన తమ్ముడు కిషోర్‌ను శివారెడ్డి హత్య చేశాడని సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ నియంత్రణ పాటించిన వారికి ప్రశంసలు



కుటుంబ నియంత్రన పాటించిన కుటుంబానికి నగదు బహుమతి అందజేస్తున్న కలెక్టర్

మహారాణిపేట : కుటుంబ నియంత్రణ పాటించిన కుటుంబాలను కలెక్టర్ మల్లికార్జున ప్రశంసించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జులైలో నిర్వహించిన లక్కీడిప్‌లో గెలుపొందని వారికి సోమవారం కలెక్టర్ ప్రోత్సాహక నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. భాగ్యలక్ష్మి, జి.జ్యోతి, డి.సునీత, వ్యాసెక్టమీ చేయించుకున్న కె.జీవన్ కుమార్‌కు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున కలెక్టర్ అందజేశారు. వైద్య విభాగంలో అగనంపూడి సీహెచ్‌సీ డాక్టర్ పి.ఉషకు రూ.7 వేలు, రెండో బహుమతి పొందిన డాక్టర్ విజయ కుమారి (వీజీహెచ్)కు రూ.5వేలు, ఉత్తమ వ్యాసెక్టమి సర్జన్‌గా ఎంపికై న డాక్టర్ యుగంధర్ (కేజీహెచ్) రూ.4వేలు , ఉత్తమ మోటివేటర్ జె.సత్యకుమారి, డీఎస్‌వీహెచ్ మహాలక్ష్మి (అంగనంపూడి ఏరియా ఆస్పతి), పి.వనిత (కేజీహెచ్) రూ.3వేలు అందజేశారు. అలాగే ఎస్.నాగలక్ష్మి(యూపీహెచ్‌సీ,బుచ్చిరాజుపాలెం), వి.వెంకటలక్ష్మి (యూపీహెచ్‌సీ,పీఎం పాలెం), ఆశా కార్యకర్తలు బి.విజయ (యూపీహెచ్‌సీ, పీఎంపాలెం), ఎ.విజయలక్ష్మి (యూపీహెచ్‌సీ, నరవ) ఒక్కొక్కరికి రూ.2,500 అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటడం అభినందనీయం

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా నిర్వహించిన క్రీడల్లో అండర్-14,17 విభాగాల్లో విశాఖ జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకోవటం అభినందనీయమని డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు. ఈ నెల 23న విజయవాడలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి సమావేశంలో విద్యాశాఖ కమిషనర్ ఈ విషయాన్ని ప్రకటించి విశాఖ జిల్లాకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు ప్రకటించినట్లు పేర్కొన్నారు. జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపినందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా నిర్వాహకులు, ఫిజికల్ డైరెక్టర్లను డీఈవో అభినందించారు.

ముగిసిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు



విజేతలతో రాష్ట్ర గ్రాప్లింగ్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి తదితరులు

జాతీయ పోటీలకు 80 మంది ఎంపిక

మధురవాడ: హోరాహోరీగా సాగిన రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు సోమవారంతో ముగిశాయి. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3వ ఏపీ స్టేట్ జూనియర్స్, బాల, బాలికలు, సీనియర్ మెన్ అండ్ వుమెన్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ - 2023 పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 80 మంది బ్రాంజ్, సిల్వర్ మెడల్స్ సాధించి జాతీయ పోటీలకు ఎంపిక కాగా విశాఖ జిల్లాకు చెందిన వారు 17 మంది ఉన్నారు. నెల్లూరు జిల్లా ఓవరాల్ చాంపియన్స్‌గా, తిరుపతి ద్వితీయ స్థానంలో నిలవగా విశాఖ జిల్లా తృతీయ స్థానంతో సరిపెట్టుకుంది. విజేతలకు ఏపీ స్టేట్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేంద్ర రెడ్డి, కార్యదర్శి డి.సాయిసుమతి, చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పెంటకోట రాము తదితరులు బహుమతులు అందజేశారు.

28 నుంచి హర్యానాలో జాతీయ పోటీలు

ఈ నెల 28 నుంచి అక్టోబర్ 2 వరకు హర్యానా రాష్ట్రంలోని రోహతక్ మహర్షి దయానంద్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు ఆంధ్ర రాష్ట్రం నుంచి గెలుపొందిన 80 మంది హాజరవుతారని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో పీడీ పెంటకోట రాము, జాల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జగదీశ్వరరావు, మురళి, ట్రెజరర్ రామచంద్రరావు, కోచ్‌లు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

సీఎంఎస్ ద్వారా ఒక్క రోజులో తీర్పు

అక్కిరెడ్డిపాలెం: కోర్టు మానిటరింగ్ సిస్టం (సీఎంఎస్) ద్వారా విచారణ త్వరతగతిన జరిపి నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధించింది. పెదగంట్యాడ వికాస్‌నగర్‌కు చెందిన రౌడీ షీటర్, సస్పెక్ట్ షీట్ హోల్డర్ అయిన ముప్పిడి కృష్ణ ప్రసాద్ 2018లో పెదగంట్యాడలో ఒక ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. దీంతో పాటు స్థానికంగా పలు దొంగతనాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతుంటడంతో అతనిపై న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. రౌడీ షీటర్ కృష్ణ ప్రసాద్‌పై ఉన్న కేసును ఏపీ డీజీపీ చొరవతో విశాఖ సిటీ కమిషనర్ ఆధ్వర్యంలో సీఎంఎస్ ద్వారా గాజువాక 8వ ఏసీఎంఎం కోర్టుపై విధంగా తీర్పును వెలువరించింది.

28న షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

మధురవాడ: విశాఖపట్నం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీల కోసం జిల్లా జట్టును ఈ నెల 28 మధురవాడ గ్లోబ్ స్కూల్‌లో ఎంపిక చేయనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఇల్లాపు వెంకటరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలురకు పోటీలు నిర్వహిస్తారని, ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. 01 - 04 - 2007 తర్వాత జన్మించిన వారు అర్హులని, పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు ఖచ్చితంగా తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 88860 11769లో సంప్రదించాలని కోరారు.

జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు అభినందనల వెల్లువ



జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్రతో ఉద్యోగులు

మహారాణిపేట: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా జె.సుభద్ర పదవి చేపట్టి దిగ్విజయంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీరాజ్ ఎస్‌ఈ రవీంద్ర, ఏపీ ట్రాన్స్‌కో ఎస్‌ఈ మహేంద్ర, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు, కార్యదర్శి సీతారామరాజు, జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ తదితరులు సుభద్రను పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సుభద్ర మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్‌గా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొని మూడో ఏడాదిలోకి అడుగు పెడుతున్న తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. గడచిన రెండు సంవత్సరాల్లో ఎన్నో విజయాలు సాధించామన్నారు. మారుమూల ప్రాంతంలో ఉన్న తనను ఈ పదవిలో కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రయాణంలో ఎంతో మంది సహకారం అందించారని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.59,950
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.54,950
వెండి(కిలో):	రూ.79,000

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	533.00
విజయనగరం	537.00
శ్రీకాకుళం	537.00

త్వరలోనే రైతులకు కన్వేయన్స్ డీడ్‌లు



కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: నవ రత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా భూ సమీకరణ కింద భూములిచ్చిన రైతులకు అక్టోబర్ 23వ తేదీలోగా కన్వేయన్స్ డీడ్‌ల జారీ చేయనున్నామని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. సోమవారం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 2020లో భూ సమీకరణకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇందులో డి.పట్టాదారులు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన అర్హులైన రైతులు సుమారు 4900 ఎకరాలను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అందజేశారన్నారు. భూములిచ్చిన రైతులకు 1215 ఎకరాల్లో రూ.600 కోట్లతో లేఅవుట్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ లేఅవుట్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఇంటింటి ఓటరు సర్వేలో 3.50 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటి పరిశీలన శరవేగంగా జరుగుతోందని వివరించారు. వచ్చేనెల 17న ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేస్తామన్నారు.

ఆధ్యాత్మికత అత్యంత ఆవశ్యం



మాట్లాడుతున్న డాక్టర్ కోహ్ జాంగ్

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ సాహిత్య భారతి సౌజన్యంతో కన్వీనర్, ద్వితీయ భాషా విభాగ అధ్యక్షుడు డాక్టర్ పి.కె.జయలక్ష్మి నేతృత్వంలో భారతీయ సాహిత్యం, ఆధ్యాత్మికత అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ బహుభాషా సదస్సు సోమవారం నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ పూర్వ విద్యాశాఖ మంత్రి, హిందీ సాహిత్య భారతి వ్యవస్థాపకుడు డాక్టర్ రవీంద్ర శుక్ల, ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు పూర్వ ఆచార్యులు వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, దక్షిణ కొరియాకు చెందిన డాక్టర్ కోహ్ జాంగ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఆధ్యాత్మికత నేటి యుగంలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. తెలుగు, హిందీ, సంస్కృత సాహిత్యాల్లో, ఇతిహాసాల్లో, పురాణాల్లో ప్రవచించిన ఆధ్యాత్మిక తత్వాన్ని వివరించారు. అనంతరం అంతర్జాతీయ సదస్సు గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, సాహితీ వాచస్పతి డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ సుమన్‌లత, డాక్టర్ నళినిదత్త, డాక్టర్ సుధ, డాక్టర్ కృష్ణబాబు, నిర్మల, డికే రాజు, డాక్టర్ దీప్తి, ప్రమీల, వీణ, గౌరీనాయుడు, తెలుగు, హిందీ, సంస్కృతం ఫ్రెంచ్, ఆంగ్ల అధ్యాపకులు పాల్గొన్నారు.